సాక్షి
జోగులాంబ గద్వాల

గురువారం। 27। జూలై। 2023



ఓపెన్ స్కూల్ పిలుస్తోంది..

చదువు మానేసినా.. నేరుగా పది, ఇంటర్ పూర్తి చేసేందుకు ఓపెన్ స్కూల్‌లో ప్రవేశాలు పొందాలి.

వివరాలు 8లో ▸



.. 30 వేల క్యూసెక్కులు

జూరాల ప్రాజెక్టుకు బుధవారం రాత్రి 30 వేల క్యూసెక్కుల వరద వచ్చి చేరింది.

వివరాలు 10లో ▸

గరిష్టం/కనిష్టం
26.5 /22.4

వాతావరణం

రోజంతా ఆకాశం మబ్బులు కమ్ముకుని ఉంటుంది. ముసురుతో పాటు అప్పుడప్పుడు భారీ నుంచి అతిభారీ వర్షం కురవచ్చు.

న్యూస్‌రీల్

పాఠశాలల అభివృద్ధికి శాలసిద్ధి దోహదం



గద్వాల: శాలసిద్ధి ద్వారా పాఠశాల అభివృద్ధి సాధ్యమవుతుందని నోడల్ అధికారి అమీర్ బాష పేర్కొన్నారు. బుధవారం జిల్లాలో ఎంపిక చేసిన 11 ఉన్నత పాఠశాలలు, 15 ప్రాథమిక పాఠశాలల స్వీయ మదింపు శాలసిద్ధి పోర్టల్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాల స్థాయిని ఏడు విభాగాలుగా నిర్ణయించి, వాటిలో వెనుకబడిన అంశాలను గుర్తించాలన్నారు. పాఠశాలను ఏవిధంగా అభివృద్ధి చేయాలనే దానిపై కార్యాచరణను రూపొందించుకోవాలని సూచించారు. శాలసిద్ధి మదింపు చేయాలని, ఇది పాఠశాల అభివృద్ధికి దోహదం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సెక్టోరియల్ అధికారిణి ఎస్తేర్ రాణి, ఆర్పీలు చంద్రశేఖర్, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

వేరుశనగ క్వింటా రూ.5536

గద్వాల వ్యవసాయం: గద్వాల మార్కెట్ యార్డుకు బుధవారం 167 క్వింటాళ్ల వేరుశనగ విక్రయానికి వచ్చింది. క్వింటాకు గరిష్టం రూ.5536, కనిష్టం రూ. 3159, సరాసరి రూ. 4360 ధరలు లభించాయి.

ఐటీ టవర్‌లో 'ఎస్2 ఇంటిగ్రేటర్స్'

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: అమెరికాకు చెందిన సాఫ్ట్‌వేర్ కంపెనీ 'ఎస్2 ఇంటిగ్రేటర్స్' దివిటిపల్లిలోని ఐటీ టవర్‌లో ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చింది. ఈ మేరకు ఆ సంస్థకు చెందిన ప్రతినిధులు శ్రీకాంత్ లింగిడి, శ్రీనివాసన్ సంతాన హైదరాబాద్‌లోని మినిస్టర్స్ క్వార్టర్స్‌లో బుధవారం రాష్ట్ర ఎక్సైజ్, క్రీడల శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌తో సమావేశమయ్యారు. ఇందులో సుమారు 100 మంది యువతకు సాఫ్ట్‌వేర్ ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. ఈ పరిశ్రమ ను త్వరలోనే నెలకొల్పుతామన్నారు. కాగా, ప్రభుత్వం తరపున అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. స్థానికంగా అర్హత కలిగిన యువతకు ఉద్యోగాల్లో మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు పట్నం నరేందర్‌రెడ్డి, అబ్రహం, బొల్లం మల్లయ్యయాదవ్ పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ ఆర్‌ఎం

స్టేషన్ మహబూబ్‌నగర్: డయల్ యువర్ ఆర్టీసీ ఆర్‌ఎం కార్యక్రమాన్ని గురువారం నిర్వహిస్తున్నట్లు రీజినల్ మేనేజర్ వి.శ్రీదేవి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల వరకు ప్రయాణికులు తమ సూచనలు, సలహాలను 9959226295 నంబర్‌కు తెలియజేయాలని ఆమె కోరారు.

14 ఏళ్లుగా నిరీక్షణే..!

వరద బాధితులకు కలగానే పునరావాసం



అలంపూర్‌లోని వరద బాధితుల ప్లాట్లలో ముళ్ల పొదలు తొలగించి చదును చేసిన దృశ్యం

2009 అక్టోబర్ 2.. కృష్ణ, తుంగభద్ర నదులు ఉప్పొంగాయి. నదీతీరంలోని 32గ్రామాలను వరద ముంచెత్తింది.. ఇల్లు, వస్తువులు సర్వం కోల్పోగా.. బతుకుజీవుడా అంటూ ప్రజలు సురక్షిత ప్రాంతానికి వెళ్లారు. నిర్వాసితులకు పునరావాసం కల్పిస్తామని ప్రభుత్వం అప్పట్లో హామీ ఇచ్చింది. దాదాపు 14 ఏళ్లు గడిచాయి. ఇప్పటికీ నిర్వాసితులకు ఇళ్ల స్థలాలు, పునరావాసం కలగానే మారింది. కొందరికి పట్టాలిచ్చారు.. కానీ, భూమి చూపలేదు. మరికొందరిని ఇళ్ల స్థలాల అర్హుల జాబితాలోనే పేర్లు చేర్చలేదు. ఈ అంశంపై చర్చ జరిగిన ప్రతిసారి సర్వేలు.. విచారణ చేస్తారే తప్పా ఇంటి స్థలం మాత్రం చూపలే. తాజాగా ఈ ఏడాది మే నుంచి నిజమైన అర్హుల ఎంపిక కోసం మరోసారి ఇంటింటికీ తిరిగి అధికారులు విచారణ చేస్తున్నారు. చూడాలి 14 ఏళ్ల నిర్వాసితుల నిరీక్షణ ఇప్పటికైనా వీడుతుందో.. లేదో.

- 2011లో 43.27 ఎకరాల భూమి సేకరణ
- అర్హుల ఎంపిక అంటూ సర్వేలు, విచారణ పేరిట కాలయాపన
- తాజాగా కలెక్టర్ ఆదేశాలతో గత నెల మరోసారి విచారణ
- 768 మందితో జాబితా సిద్ధం.. మా పేర్లు లేవని 670మంది దరఖాస్తు
- ఇంటింటికి వెళ్లి విచారిస్తున్న రెవెన్యూ అధికార బృందం

అలంపూర్: నియోజకవర్గంలోని ముంపునకు గురైన గ్రామాల ప్రజలకు పునరావాసం కలగానే మారింది. 2009 వరదల్లో అలంపూర్, రాజోలి, తుమ్మలపల్లి, పడమటి గార్లపాడు, తూర్పుగార్లపాడు, తుమ్మిళ్ల, నసనూరు, ఆర్. గార్లపాడు, కూటక్కనూరు, మద్దూరు గ్రామాలు భారీగా దెబ్బతిన్నాయి. అలంపూర్‌లో రక్షణగోడ పైనుంచి వరద నీరు చేరడంతో దాదాపు నెల రోజులపాటు నీటిలో ఉంది. దీంతో భారీ నష్టం వాటిల్లింది.

పునరావసం కోసం 43.27 ఎకరాలు సేకరణ

అయితే, అలంపూర్ పట్టణంలోని నిర్వాసితులకు ప్రభుత్వం పునరావాసం కల్పిస్తామని హామీ ఇచ్చింది. ఈమేరకు 2011లో అలంపూర్ పట్టణ (తాజాగా మున్సిపాలిటీ) శివారులో 43.27 ఎకరాల స్థలాన్ని సేకరించి అందులో దాదాపు 1425 ప్లాట్లు చేశారు. అప్పట్లోనే ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. పట్టాలు పంపిణీ చేసినప్పటికీ ఇళ్ల స్థలాలు చూపలేదు. కొనుగోలు చేసిన భూమిని ప్లాట్లుగా మార్చినప్పటికి ఆ ప్లాట్లకు నంబర్లు ఇవ్వకపోవడంతో ఎవరి ప్లాటు ఎక్కడ ఉందో తెలియక లబ్ధిదారులు ఇండ్లు నిర్మించుకొనే అవకాశం లేకుండాపోయింది.

పట్టాలు వెనక్కి.. పునఃవిచారణ

పునరావసం కోసం ఇచ్చిన పట్టాల విచారణ నిరంతరం కొనసాగుతోంది. ఈ ఏడాది మే నెలలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గతంలో నిర్వాసితులకు ఇచ్చిన పట్టాలను రెవెన్యూ అధికారులు వెనక్కి తీసుకున్నారు. గతంలో పట్టాలిచ్చిన నిర్వాసితుల్లో అర్హులకంటే అనర్హులు అధికంగా ఉన్నారనే ఫిర్యాదు వెల్లువెత్తాయి. దీంతో కలెక్టర్ ఆదేశాల మేరకు లబ్ధిదారుల నుంచి పట్టాలను వెనిక్కి తీసుకున్నారు. అనంతరం ప్రత్యేక బృందాలతో ఇంటింటి విచారణ చేపట్టి అర్హుల జాబితాను సిద్ధం చేశారు. అర్హుల జాబితా సిద్ధం కావడంతో త్వరలో పట్టాల పంపిణీ చేపట్టడానికి అధికారులు కసరత్తు చేశారు.

ఇళ్ల స్థలాల కోసం మరో 670 మంది దరఖాస్తు

మున్సిపాలిటీ అధికారులు నిర్వాసితుల ప్లాట్లలో ఉన్న ముళ్లపొదలను తొలగించడం షురూ చేశారు. కానీ వరదల్లో ముంపునకు గురైన ఆయా కాలనీల నుంచి తాజాగా 670 మంది ఇళ్ల స్థలాల కోసం దరఖాస్తులు చేసుకున్నారు. వరదల్లో నష్టపోయిన వాళ్లలో ప్రధానంగా ఉన్నప్పటికి జాబితాలో పేర్లు లేవనిక లెక్టర్, ప్రజాప్రతినిధులకు వినతులు అందించారు. అందుకు తగ్గట్టుగా దరఖాస్తులు వెల్లువెత్తడంతో అధికారులు తాజా వచ్చిన దరఖాస్తులపై అధికారులు విచారణ చేస్తున్నారు.



అర్హులైన వారికి ఇళ్ల పట్టాలు ఇవ్వలేదని అప్పటి ఆర్డీఓకు వినతి పత్రం అందజేస్తున్న నిర్వాసితులు

న్యాయం చేయాలి



2006, 2009 వరదల్లో అలంపూర్ పట్టణంలోని మా కాలనీ వాసులు ఎక్కువగా నష్టపోయారు. అప్పట్లో పర్యటించిన అధికారులు నష్టం ఎక్కువ జరిగిందని నివేదికలు ఇచ్చారు. కానీ నిర్వాసితుల ప్లాట్ల జాబితాలో మా కాలనీకి చెందిన వారి పేర్లు లేవు. ఇదే విషయాన్ని ప్రజాప్రతినిధులకు విన్నవించాం. మా కాలనీ వాసులకు న్యాయం చేయాలి.

– ప్రేమదాసు, అలంపూర్

విచారణ చేస్తున్నాం



వరద బాదితుల నుంచి వచ్చిన దరఖాస్తుల ఆధారంగా ప్రత్యేక బృందాలు విచారణ చేపడుతున్నాయి. త్వరలో విచారణ పూర్తి చేస్తాం. గతంలో పట్టాలిచ్చిన లబ్ధిదారుల విచారణ చేపట్టడం జరిగింది. విచారణ అనంతరం లబ్దిదారుల జాబితాను సిద్ధం చేసి ఉన్నత అధికారులకు నివేదిస్తాం. కలెక్టర్ నుంచి ఆదేశాల మేరకు ప్లాట్ల పంపిణీ వివరాలు వెల్లడిస్తాం.

– సుభాష్ నాయుడు, తహసీల్దార్, అలంపూర్



అలంపూర్‌లో విచారణ చేస్తున్న అధికారులు

పునరావసంపై పట్టింపేది..?

జిల్లాలో వరదల్లో సర్వం కోల్పోయిన నిర్వాసితుల పునరావసంపై పట్టింపు లేకుండాపోయింది. వరద ముంపునకు గురైన నిర్వాసితుల్లో కూట్కనూరు, ఆర్.గార్లపాడు గ్రామాల్లో పునరావసం కల్పించారు. రాజోలిలో పునరావసం అసంపూర్తిగానే ఉంది. రాజోలిలో వరద బాధితుల పునరావసం కోసం దాదాపు 212 ఎకరాలను సేకరించారు. 3048 కుటుంబాలకు ఇళ్ల నిర్మాణాల కోసం ప్లాట్లుగా మార్చారు. స్వచ్ఛంద సంస్థల సహకారంతో 2175 ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేశారు. 450 వరకు ఇళ్ల నిర్మాణాలు అసంపూర్తిగా ఉండగా 500 వరకు ఇళ్ల నిర్మాణాలు ప్రారంభానికి నోచుకోలేదు. తూర్పుగార్లపాడులో169 ఇళ్లు, తుమిళ్ల లో 499, నసనూరులో సుమారు 290 ఇళ్ల నిర్మాణాలు ఎక్కడవేసిన గొంగడి అక్కడే అన్న చందంగా మారింది. చేనేత కార్మికులకు ఇళ్లతో పాటుగా మగ్గాల కోసం 750 షెడ్‌లను నిర్మిస్తామని భరోసా ఇచ్చినా ఆ హామీ అమలుకు నోచుకోలే.

ఉద్యానవన పంటలకు ప్రోత్సాహం



మాట్లాడుతున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

- మొక్కలు, డ్రిప్ ఏర్పాటుకు ఎస్సీ, ఎస్టీ, ఇతర రైతులకు సబ్సిడీ
- వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి
- కలెక్టర్ వల్లూరు క్రాంతి

గద్వాల రూరల్: ఉద్యానవన పంటలతో అధిక లాభాలు పొందవచ్చని కలెక్టర్ వల్లూరు క్రాంతి అన్నారు. బుధవారం ఐడీవోసి కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆయిల్‌పాం పంట సాగుచేసేందుకు ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తుందని, సాంప్రదాయ పంటలకు ప్రత్యమ్నయంగా ఆయిల్‌పాంను సాగుచేస్తే దీర్ఘకాలికంగా రైతులు ప్రయోజనాలు పొందవచ్చన్నారు. 5ఎకరాల భూమి ఉన్న చిన్న, సన్నకారు రైతులను లక్ష్యంగా చేసుకుని ఆయిల్‌పాం సాగు వల్ల కలిగే ప్రయోజనాలను వివరించేలా ప్రణాళిక రూపొందించుకోవాలని వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులను ఆదేశించారు. పండ్లతోటలు సాగు చేయటానికి మొక్కలు, డ్రిప్పులను ఎస్సీ, ఎస్టీ రైతులకు వందశాతం, ఇతరులకు 90శాతం సబ్సిడీ కల్పిస్తుందన్నారు. హరితహారంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా గ్రామ పంచాయతీ రోడ్ల వెంబడి అవెన్యూ ప్లాంటేషన్ ఏర్పాటు చేయాలన్నారు. ఫీల్డ్‌వెరిఫికేషన్ చేసి ఎక్కడ ఖాళీ ఉంటే అక్కడ మొక్కలను నాటేలా చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా బృహత్‌ప్రకృతి వనాలు, ప్రకృతి వనాలలో విరివిగా మొక్కలు నాటేలా చర్యలు తీసుకోవలన్నారు. జిల్లా వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నందున ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. అదేవిధంగా సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ అపూర్వ్‌చౌహాన్, డీఆర్డీఓ ఉమాదేవి, జెడ్పీ సీఈవో ముషాయిదాబేగం, డీపీవో గోవిందునాయక్, హార్టికల్చర్ అధికారి అక్బర్, డీపీవో శ్యాంసుందర్, ఎంపీడీవోలు, తదితరులు పాల్గొన్నారు.

వర్షాలతో అప్రమత్తం

రానున్న 48గంటలలో అతి భారీ వర్షాలు కురువనున్నట్లు వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో అందరూ కూడా అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ జిల్లాలోని అన్ని శాఖల అధికారులను ఆదేశించారు. బుధవారం హైదరాబాద్ నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఎస్పీ సృజన, అదనపు కలెక్టర్ అపూర్వ్‌చౌహాన్‌తో కలిసి ఆమె పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



ఆర్డీఓ కార్యాలయం ఎదుట కరపత్రాలు విడుదల చేస్తున్న తపస్ నాయకులు

గద్వాల: రాష్ట్రంలో దశాబ్ద కాలంగా అపరిష్కృతంగా ఉన్న ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(తపస్) జిల్లా నాయకులు శ్రీధర్ రెడ్డి, నాగరాజు డిమాండ్ చేశారు. రాష్ట్ర తపస్ పిలుపు మేరకు ఉపాధ్యాయ ఉద్యమ జాగరణ కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆర్డీఓ కార్యాలయం ఎదుట కరపత్రాలను విడుదల చేశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 12 సంవత్సరాలుగా రాష్ట్రంలో ఉపాధ్యాయులకు ప్రమోషన్లు, ఐదు సంవత్సరాలుగా బదిలీలు జరగడం లేదన్నారు. ఉపాధ్యాయులు తీవ్ర నిరాశలో ఉన్నారని ఆందోళన వ్యక్తం చేశారు. స్వరాష్ట్రంలో రెండో పీఆర్సీ కమిషన్‌ని వెంటనే ప్రకటించి ఉద్యోగులు నష్టపోకుండా ఐఆర్‌ను ప్రకటించాలని డిమాండ్ చేశారు. సకాలంలో డీఏలు అందడం లేదన్నారు. ఏరియర్స్‌ను వాయిదాల పద్ధతిలో చెల్లించే విధానాన్నికి స్వస్తి పలకాలని సూచించారు. సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. కేజీబీవీ, గురుకుల పాఠశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలన్నారు. ఆయా పాఠశాలలో వాచ్‌మెన్‌లు, స్కావెంజర్స్ లేక పాఠశాలలో ఉన్న విలువైన వస్తువులకు భద్రత లేకుండా పోయిందన్నారు. అనంతరం తహసీల్దార్ వెంకటేశ్వర్లుకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో తపస్ నాయకులు మల్లికార్జున్, ప్రవీణ్, రవికృష్ణ, సమరసింహారెడ్డి, కృష్ణకుమార్, భానుప్రకాష్, మహేందర్, మురళీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే పేదల సంక్షేమం

గద్వాల అర్బన్: కాంగ్రెస్ పార్టీ నేతృత్వంలోని ప్రభుత్వ ఏర్పాటుతోనే పేదల సంక్షేమం.. ప్రతి గ్రామం అభివృద్ధి సాధ్యమవుతుందని జెడ్పీ చైర్‌పర్సన్ సరిత అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఆమె నివాసంలో మల్దకల్ మండలంలోని అమరవాయి, మేకలసోంపల్లి, బుడిదపాడు, చాగదోన గ్రామాల ప్రజలు కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్‌పర్సన్ వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన కాంగ్రెస్ పార్టీకి అండగా ఉండాలని, పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కష్టపడి పనిచేయాలని అన్నారు. కార్యక్రమంలో నాయకులు బండ్ల చంద్రశేఖర్ రెడ్డి, భీమన్న, కృష్ణారెడ్డి, వెంకటన్న, పరుశరాముడు, తిమ్ములు, ప్రవీణ్, ఆంజనేయులు, తదితరులు ఉన్నారు.



పార్టీలోకి ఆహ్వానిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ సరిత

నిలిచిన వాటర్ గ్రిడ్ పనులు



పెద్దవాగులో వర్షపు నీరు నిల్వ ఉండడంతో నిలిచిన పనులు

అయిజ: పట్టణంలోని పెద్ద వాగుపై చేపట్టిన వాటర్ గ్రిడ్ పైప్‌లైన్ పునరుద్ధరణ పనులు నిలిచిపోయాయి. మంగళవారం రాత్రి కురిసిన వర్షానికి వాగులో నీరు నిలువచేరి పైప్‌లైన్ పునరుద్ధరణ పనులకు ఆటంకం ఏర్పడింది. దీంతో వాగులో నిర్మించాల్సిన పిల్లర్ల పనులు ప్రారంభ దశలోనే నిలిచిపోయాయి. బుధవారం వాగులో నిల్వ ఉన్న నీటిని మోటార్ పంప్‌తో తోడేసే పనిలో సిబ్బంది నిమగ్నమయ్యారు. నీటిని ఎంత తోడివేసినా లాభం లేకపోవడంతో సిబ్బంది చేతులెత్తేశారు. వాటర్ గ్రిడ్ ఈఈ భీమేశ్వర్‌రావు, డీఈ నాగరాజు, ఏఈ రమేష్, ప్రాజెక్ట్‌మేనేజర్ చంద్రమోహన్ నీటినితోడే పనులను పరిశీలించి వెనుతిరిగారు. అనాలోచితంగా వర్షాకాలంలో పనులు ప్రారంభించడంతో పైప్‌లైన్ కూలిపోయిందని, దీనివల్లే దాదాపు 86 గ్రామాలకు మిషన్ భగీరథ నీటి సరఫరా నిలిచిపోయిందని ప్రజలు ఆగ్రహం వ్యక్తంచేశారు.

వదలని వాన..

- జిల్లాలో రెండు రోజులుగా విస్తారంగా వర్షాలు
- మరో 48 గంటలు అతి భారీ వర్షాలు కురిసే అవకాశం
- అప్రమత్తంగా ఉండాలని అధికార యంత్రాంగానికి కలెక్టర్ ఆదేశం
- వడ్డేపల్లి, ఉండవెల్లిలో అత్యధికంగా 40.1 మి.మీ. వర్షపాత నమోదు



మానవపాడు శివారు పొలాల్లో నిలిచిన వర్షపు నీరు

అలంపూర్: ఉదయం నుంచి రాత్రి వరకు వాన వదలట్లేదు. గత రెండు రోజులుగా జడివాన కురుస్తూనే ఉండడంతో ప్రజలు ఇళ్లకే పరిమితమవుతున్నారు. వారం రోజులుగా చిన్నపాటి జల్లులు.. ఇటీవల భారీ వర్షాలతో వాగులు, సెలయేర్లు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. దీంతో రైతుల్లో ఆనందం నెలకొంది. లోతట్టు ప్రాంతాల్లోకి నీరు చేరుతుండడంతో ప్రజలు అప్రమత్తమవుతున్నారు. ఇదిలాఉండగా, రాష్ట్ర ప్రభుత్వం విద్యా సంవస్థలకు సెలవు ప్రకటించడంతో ఇబ్బందులు తప్పాయి. అలంపూర్ నియోజకవర్గంలో కొన్ని చోట్ల పాత గోడలు కూలిపోయాయి. అక్కడక్కడ విద్యుత్ స్తంభాలు పక్కకు ఒరిగి ప్రమాదకరంగా మారాయి. గ్రామాల్లో అంతర్గత రోడ్లపై వర్షపు నీరు చేరడంతో రాకపోకలకు ఇబ్బందులు పడాల్సి వచ్చింది.

వడ్డేపల్లిలో అత్యధిక వర్షపాతం..

నియోజకవర్గంలో అత్యధికంగా వడ్డేపల్లి మండలంలో 40.1 మి.మీ, ఉండవెల్లి మండలంలో 40.1 మి.మీ వర్షపాతం నమోదైంది. అత్యల్పంగా అయిజ మండలంలో 20.8 మి.మీ వర్షపాతం నమోదైంది. అలంపూర్ మండలంలో 39.6 మి.మీ. ఇటిక్యాలలో 33.8 మి.మీ, మానవపాడులో 32.6 మి.మీ, రాజోలిలో 31.6 మి.మీ వర్షపాతం నమోదయ్యాయి. గురు, శుక్రవారం సైతం జిల్లాలో భారీ వర్షం కురిసే అవకాశం ఉన్నట్టు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. పాతబడిన ఇళ్లలో ఉండేవారు సురక్షిత ప్రాంతాలు, పక్కా ఇళ్లలో ఆశ్రయం పొందాలని కలెక్టర్ సూచించారు.



పచ్చర్ల గ్రామంలో బురదమయంగా అంతర్గత రోడ్డు



కుంటను తలపిస్తున్న ఉండవెల్లి జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాల ఆవరణ

భారీ మీనం.. యువకుల సంబురం

ఉండవెల్లి: ఎడతెరిపి లేని వర్షాలతో కృష్ణానదిలోకి వరద నీరు వచ్చి చేరుతోంది. మండలం మీదుగా కృష్ణా నది ప్రవహిస్తుండడంతో నది ఒడ్డున ఉన్న గ్రామాల్లో చేపలు పట్టేందుకు యువత ఉత్సాహం చూపుతున్నారు. మారమునగాల-1,2, శేరుపల్లె, ప్రాగటూరు గ్రామాల్లో భారీ చేపలు సైతం అలవోకగా దొరకబుచ్చుకుంటున్నారు. ఒక్కో చేప 10కిలోల నుంచి 20, 30 కిలోల బరువు ఉండడంతో యువకులు, మత్స్యకారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



శేరుపల్లెలో చేపతో యువకుడు..



మారమునగాల-2లో చేపతో మత్స్యకారుడు

గట్టు: ముసురు వర్షానికి గట్టులోని చేనేత కార్మికుడు కూనే తాయప్ప మట్టి ఇల్లు బుధవారం కూలింది. అదే ఇంట్లోనే మగ్గం నేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కూలిన మట్టి ఇల్లు కారణంగా కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. వర్షాలు ఇలానే కొనసాగితే మరి కొన్ని మట్టి ఇండ్లు కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి.

వైద్య సిబ్బందిపై చర్యలు తీసుకోవాలి



పీహెచ్‌సీలో మహిళలతో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి

అయిజ: ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బంది నిబంధనలు పాటించడంలేదని, ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని పీహెచ్‌సీని బీజేపీ నాయకులు సందర్శించారు. ఈసందర్భంగా ఆస్పత్రిలోని రోగులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పీహెచ్‌సీలో పనిచేసే వైద్యులు సమయపాలన పాటించకపోవడంతో రోగులు ఇబ్బందులకు గురవుతున్నారని వాపోయారు. డాక్టర్లు సమయానికి రావడంలేదని, కొందరు డాక్టర్లు నెలకు కొన్ని రోజులు మాత్రమే విధులకు హాజరవుతున్నారని, రిజిస్టర్‌లో మాత్రం ప్రతి రోజు హాజరై సంతకాలు పెడుతున్నారని ఆరోపించారు. బుధవారం ఆయుష్ వైద్యురాలు సుధారాణి మాత్రమే విధులకు హాజరయ్యారని, మెడికల్ ఆఫీసర్ విష్ణు, వైద్యులు మానస, దీప్తి అందుబాటులో లేరని ఆరోపించారు. ప్రతిరోజు సుమారు 200 మంది రోగులు ఆస్పత్రికి వస్తుంటారని ఒక్కరు మాత్రమే వారికి వైద్యసేవలు అందిస్తున్నారని అన్నారు. పీహెచ్‌సీలో బయోమెట్రిక్ విధానం చేపట్టాలని, నిబంధనలు ఉల్లంఘిస్తున్న వారిపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అలంపూర్ అసెంబ్లీ కన్వీనర్ మెడికల్ తిరుమలరెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యుడు నాగరాజు, పట్టణ ప్రధాన కార్యదర్శి భగత్ రెడ్డి, పట్టణ ఉపాధ్యక్షులు లక్ష్మణ్ గౌడ్, జిల్లా ఓబీసీ ఉపాధ్యక్షులు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్రమాదవశాత్తు వ్యక్తి మృతి

అచ్చంపేట రూరల్: నూతన ఇంటి నిర్మాణంలో సెంట్రింగ్ పనులు చేస్తూ ఓ వ్యక్తి కింద పడి మృతి చెందిన ఘటన బుధవారం అచ్చంపేట పట్టణంలోని టంగాపూర్ కాలనీలో చోటు చేసుకుంది. అచ్చంపేట ఎస్ఐ గోవర్ధన్ వివరాల ప్రకారం.. పట్టణంలోని మధురానగర్ కాలనీకి చెందిన గాంధీ(37) బుధవారం టంగాపూర్ కాలనీలో నూతన ఇంటి నిర్మాణంలో సెంట్రింగ్ పనులు చేయడానికి వెళ్లాడు. సెంట్రింగ్ డబ్బాలను తొలగించే క్రమంలో కింద పడడంతో తలకు బలమైన గాయం తగిలింది. వెంటనే అచ్చంపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు పరిస్థితి విషమంగా ఉందని హైదరాబాద్‌కు రెఫర్ చేశారు. హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలోనే అతను మృతి చెందాడు. అతని భార్య మేరీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గోవర్ధన్ తెలిపారు.

చికిత్స పొందుతూ మహిళ..

మక్తల్: చికిత్స పొందుతూ మహిళ మృతి చెందిన ఘటన బుధవారం పట్టణంలోని సాయినగర్ కాలనీలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. వడ్డేపల్లికి చెందిన డీ లక్ష్మి(52)కి మక్తల్‌కు చెందిన నర్సింహారెడ్డితో 10 నెలల క్రితం వివాహమైంది. అయితే నర్సింహారెడ్డికి పిల్లలు కాకపోవడంతో రెండో పెళ్లి చేసుకున్నాడు. పెళ్లికి ముందే లక్ష్మి మానసికంగా బాధపడుతుండేది. కడుపునొప్పి ఉండడంతో చికిత్స కోసం చాలా ఆస్పత్రులు తిరిగినా తక్కువ కాలేదు. కడుపు నొప్పి భరించలేక 25న రాత్రి 9గంటలకు ఒంటిపై కిరోసిన్ పోసుకొని నిప్పంటించుకుంది. దీన్ని గమనించిన కుటుంబ సభ్యులు మంటలార్పేందుకు ప్రయత్నించారు. వెంటనే ఆమెను మక్తల్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం మహబూబ్‌నగర్‌కు తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ ఆమె బుధవారం సాయంత్రం మృతి చెందినట్లు ఎస్ఐ పర్వతాలు తెలిపారు. ఆమె తమ్ముడు ప్రభాకర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

ఆటో బోల్తా : ఒకరి దుర్మరణం

మహబూబ్‌నగర్ క్రైం: రెండు గేదెలు రోడ్డుపై కొట్లాడుతుండగా వాటిని తప్పించబోయి ఆటో బోల్తాపడి ఒకరు మృతి చెందిన ఘటన మండల పరిధిలోని ధర్మాపూర్‌లో చోటుచేసుకుంది. ఎస్ఐ వెంకటేశ్వర్లు కథనం ప్రకారం .. ధర్మాపూర్ గ్రామానికి చెందిన రాములు(49) మంగళవారం మధ్యాహ్నం ఆటోలో మహబూబ్‌నగర్ నుంచి ధర్మాపూర్ వస్తున్నాడు. బండమీదిపల్లి సమీపంలో రోడ్డుపై రెండు గేదెలు కొట్లాడుతూ ఆటోకు తగలడంతో బోల్తాపడింది. దీంతో ఆటోలో ఉన్న రాములు తలకు తీవ్రగాయాలు కావడంతో చికిత్స కోసం జిల్లా జనరల్ ఆస్పత్రికి తరలించారు. పరిశీలించిన వైద్యులు అతను అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. అతని తండ్రి చెన్నారాయుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

తప్పిపోయిన బాలుడు ఇంటికి..



కోయిల్‌కొండ: తిరుపతిలో తప్పిపోయిన బాలుడు మూడు నెలల తర్వాత ఇంటికి తిరిగొచ్చిన ఘటన బుధవారం పారుపల్లిలో చోటుచేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. మండలంలోని పారుపల్లికి చెందిన శ్రీనువాసులు, జ్యోతి దంపతులు మూడునెలల క్రితం కుమారుడు వడ్డెగణేష్(7)తో కలిసి తిరుపతి దైవ దర్శనం కోసం వెళ్లారు. అక్కడ గణేష్ తప్పిపోయాడు. అక్కడున్న స్థానికులు బాబును చైల్డ్‌వెల్ఫేర్‌హోంకు తరలించారు. పోలీసులు దర్యాప్తు చేసి 3నెలల తర్వాత బుధవారం తల్లిదండ్రులకు అప్పగించారు. బాలుడు ఇంటికి చేరుకోవడంతో తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు.

పోల్కంపల్లిలో చోరీ

- రూ.2.40లక్షల నగదు అపహరణ

అడ్డాకుల: ఇంట్లో ఎవరూ లేని సమయంలో పట్టపగలే బీరువా బద్దలు కొట్టి రూ.2.40లక్షల నగదును తీసుకెళ్లిన ఘటన బుధవారం మూసాపేట మండలం పోల్కంపల్లిలో చోటుచేసుకుంది.
బాధితుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కుర్వ బీరయ్య గొర్రెల కాపరిగా పని చేస్తున్నాడు. ఇటీవల ఆయన భార్య పుట్టింటికి వెళ్లింది. మంగళవారం ఉదయం బీరయ్య ఇంటికి తాళం వేసి గొర్రెల మేపడానికి వెళ్లాడు. ఈ సమయంలో దొంగలు ఇంటి తాళం విరగొట్టి బీరువాలో ఉన్న రూ.2.40లక్షల నగదును దోచుకెళ్లారు. బీరయ్య రాత్రి ఇంటికొచ్చి చూసే సరికి తాళం విరగ్గొట్టి ఉండటంతో లోపలికి వెళ్లి బీరువా చూశాడు. అందులో నగదు కనిపించకపోవడంతో పోలీసులకు సమాచారం అందించాడు. వెంటనే పోలీసులు గ్రామానికి వెళ్లి పరిశీలించారు. బుధవారం ఉదయం క్లూస్‌టీంతో పోల్కంపల్లికి వెళ్లి ఆధారాలు సేకరించారు. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ శివారెడ్డి తెలిపారు.

ఓపెన్ స్కూల్ పిలుస్తోంది..

- రోజురోజుకూ పెరుగుతున్న ఆదరణ
- మధ్యలో స్కూల్ మానేసిన వారికి మళ్లీ చదువుకునే అవకాశం
- అడ్మిషన్లు పెంచేందుకు అధికారుల ప్రత్యేక డ్రైవ్
- ఆగస్టు 10 వరకు చేరేందుకు అవకాశం



జిల్లా కేంద్రంలోని ఐటీఐ కళాశాలలో ప్రచారం చేస్తున్న కోఆర్డినేటర్ తదితరులు (ఫైల్)

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: చదువుకోవాలని కోరిక ఉన్నప్పటికీ కుటుంబ పరిస్థితులు, పేదరికం కారణంగా అనేక మంది విద్యార్థులు చదువుకు దూరమవుతుంటారు. ఈ క్రమంలో చదువు మధ్యలో వదిలేసిన యువతీ, యువకులకు చదువుకునేందుకు అవకాశం ఇవ్వాలని ప్రభుత్వం ఓపెన్ స్కూల్ విధానాన్ని తీసుకువచ్చింది. దీంతో ఎస్సెస్సీ పూర్తి కాకుండా 14 సంవత్సరాలు నిండి, చదవడం, రాయడం వస్తే చాలు అడ్మిషన్ ఇస్తారు. పదో తరగతి పరీక్ష రాయవచ్చు. ఇంటర్‌లో చేరడానికి 16ఏళ్లు నిండి ఉండాలి. ఆగస్టు 10వ తేదీ వరకు విద్యార్థులకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పిస్తున్నారు. చేరిన విద్యార్థులకు ప్రభుత్వం పుస్తకాలు, స్టడీ మెటీరియల్ అందజేస్తుంది. స్థానికంగా ఉండే హైస్కూల్‌లో అడ్మిషన్ పొందే వెసులుబాటు ఉంది. గత సంవత్సరం ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో మొత్తం 57 స్టడీ సెంటర్‌లలో ఎస్సెస్సీలో 2,971 మంది, ఇంటర్‌లో 3,214 మంది అడ్మిషన్లు పొందారు.

ఏ ఉద్యోగానికైనా దరఖాస్తు చేయవచ్చు..

ఓపెన్ స్కూల్‌ద్వారా విద్యార్థులు ఎస్సెస్సీ, ఇంటర్మీడియట్ పూర్తి చేసిన వారికి సర్టిఫికెట్ అందిస్తారు. వీరిని నేరుగా పాఠశాలకు వెళ్లి రెగ్యులర్‌గా చదివిన వారితో సమానంగా పరిగణిస్తారు. ఓపెన్ డిగ్రీ చేసేందుకు అంబేద్కర్, రాంరెడ్డి తదితర యూనివర్సిటీల నుంచి సర్టిఫికెట్‌లు ఇస్తున్నాయి. కానీ ఓపెన్ పద్ధతిలో ఎస్సెస్సీ ఇంటర్ సర్టిఫికెట్‌లు ఇచ్చే ఏకైక ప్రభుత్వ సంస్థ ఓపెన్ స్కూల్. ఇక్కడ చదువు పూర్తయ్యాక విద్యార్థులు ఎస్సెస్సీ పాస్ అయితే రెగ్యులర్, ఓపెన్ ఇంటర్ చేయవచ్చు. ఎస్సెస్సీకి సమానమైన ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవచ్చు. అలాగే ఇంటర్మీడియట్ పూర్తయ్యాక ఒక్క ఐఐటీ, నీట్ పరీక్ష తప్ప అన్నిడిగ్రీలు చేసుకునేందుకు అవకాశం ఉంది.

ఉమ్మడి జిల్లాలో 57 స్టడీ సెంటర్‌లు..

దరఖాస్తు చేసుకున్న తర్వాత రోజువారి పనులకు ఇబ్బంది కలుగకుండా స్థానికంగానే తరగతులు సైతం వినేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఇందుకోసం ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా వ్యాప్తంగా మొత్తం 60 స్టడీ సెంటర్‌లను ఏర్పాటు చేశారు. వీటి నిర్వహణ బాధ్యతలు పూర్తిగా పలుహైస్కూల్ హెచ్‌ఎంలకు బాధ్యతలు అప్పగించారు. ఇందులో విద్యార్థులు ఎస్సెస్సీ, ఇంటర్ వారికి ప్రతి ఆదివారం తరగతులు నిర్వహిస్తారు. వివిధ పనులు చేసుకునే వారు ఈ తరగతులకు హాజరై పాఠాలు వినే అవకాశం ఉంది. మొత్తం 30 తరగతుల్లో 24 తరగతులకు హాజరైన వారికి పరీక్ష రాసేందుకు అనుమతిస్తారు. ఇంటర్‌లో సైన్స్ గ్రూపులు తీసుకున్న వారికి 48 ప్రాక్టికల్స్ తరగతులకు కూడా హాజరుకావాల్సి ఉంటుంది. అన్నిగ్రూపుల వారు తప్పకుండా అసైన్‌మెంట్ రాయాల్సి ఉంటుంది.

జిల్లా పేరు	ఎస్సెస్సీ స్టడీసెంటర్‌లు	విద్యార్థులు	ఇంటర్ స్టడీసెంటర్‌లు	విద్యార్థులు
మహబూబ్‌నగర్	13	819	14	880
నారాయణపేట్	11	631	9	595
నాగర్‌కర్నూల్	13	569	12	572
వనపర్తి	10	404	9	456
గద్వాల్	12	548	13	711
మొత్తం	57	2,971	57	3,214

సద్వినియోగం చేసుకోవాలి..



చదువు మధ్యలో మానేసిన వారికి ఎస్సెస్సీ, ఇంటర్మీడియట్ చదువుకునేందుకు ఓపెన్ స్కూల్ చాలా మంచి అవకాశం. వచ్చే నెల 10వ తేదీ వరకు అడ్మిషన్ నేరుగా ఆన్‌లైన్‌లో చేసుకునేందుకు అవకాశం ఉంది. 30వరకు ఫైన్‌తో అడ్మిషన్ పొందవచ్చు.

– రవీందర్, డీఈఓ, మహబూబ్‌నగర్

అవకాశాన్ని అందుకోవాలి..



ఓపెన్ స్కూల్‌ను పూర్తి స్థాయిలో వినియోగించుకొనే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. పని చేసుకునే సమయాల్లో కాకుండా ఆదివారాల్లో తరగతులు వినేందుకు అవకాశం ఉంది. విద్యార్థులు దీన్ని వినియోగించుకుని పైచదువులకు వెళ్లాలి.

– రాంశుభాస్‌గౌడ్, ఓపెన్‌స్కూల్ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్

రైల్వే ప్రయాణికులకు ‘జనతా ఖానా’

- రూ.15లకే ఆహారం



మహబూబ్‌నగర్ రైల్వే స్టేషన్‌లో జనతా ఖానా కౌంటర్

స్టేషన్ మహబూబ్‌నగర్: ప్రయాణికులు ఇబ్బందులు పడకుండా భారతీయ రైల్వేశాఖ అతి తక్కువ ధరకే నాణ్యమైన భోజనం అందుబాటులోకి తీసుకొచ్చింది. జనరల్ బోగిల్లో ప్రయాణించే వారికి జనతా ఖానా పేరుతో రూ.15లకే నాణ్యమైన ఆహారం అందించే ఏర్పాట్లు చేసింది. ఈ కార్యక్రమాన్ని బుధవారం హైదరాబాద్ రైల్వే డివిజన్ పరిధిలోని మహబూబ్‌నగర్ రైల్వే స్టేషన్‌తో పాటు మరో నాలుగు రైల్వే స్టేషన్లలో ప్రారంభించారు. రూ.15లకు 7 పూరీలు, కూర, చట్నీ, మిర్చి అందిస్తున్నారు. జనరల్ బోగి సమీపంలో ప్రయాణికుల కోసం జనతా ఖానా కౌంటర్‌ను ఏర్పాటు చేశారు.

పట్టపగలే ఇంట్లో చోరీ

రాజాపూర్: పట్టపగలే ఇంటి తాళం పగులగొట్టి నగదుతో పాటు, బంగారం ఎత్తుకెళ్లిన ఘటన బుధవారం మండలంలోని ఈద్గాన్‌పల్లిలో చోటుచేసుకుంది. బాధితుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన గోర బాలయ్యగౌడ్ అతని భార్య రేణుకమ్మతో కలిసి రోజు మాదిరిగా పొలంపనికి వెళ్లారు. మధ్యాహ్నం బాలయ్యగౌడ్ అన్న కొడుకు శివ ఇంటికొచ్చి చూడగా తాళం విరిగి, ఇంటి తలుపులు తెరిచి ఉన్నాయి. ఈ విషయాన్ని వెంటనే బాబాయికి చెప్పాడు. వారు ఇంటికొచ్చి చూడగా బీరువాలో రూ.80వేల నగదు, అర్ధతులం బంగారు బటువును ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. పోలీసులకు సమాచారం అందించడంతో చోరీపై విచారణ చేస్తున్నట్లు వారు తెలిపారు.

ఇన్‌స్టాలో ఫేక్ ఐడీ: యువతి ఫిర్యాదు

ధరూరు: ఓ యువతికి సంబంధించి సామాజిక మాధ్యమమైన ఇన్‌స్టాగ్రాం ఫేక్ ఐడీని సృష్టించి ఇతరులకు పలు రకాల ఫొటోలు పంపుతున్న వ్యవహారంపై ధరూరు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని మార్లబీడుకు చెందిన ఓ 19 ఏళ్ల అమ్మాయి డిగ్రీ చదువుతోంది. ఈమె పేరు మీద ఉన్న ఇన్‌స్టాగ్రాం ఐడీతో ఫేక్ ఐడీ సృష్టించి ఓ వ్యక్తి ఇతరులకు ఆ అమ్మాయి ఐడీ పేరుతో ఫొటోలు, మెసెజ్‌లు పంపుతున్నాడు. దీంతో ఆ విషయాన్ని పసిగట్టిన సదరు అమ్మాయి బుధవారం పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సదానందంగౌడ్ తెలియజేశారు. దర్యాప్తు చేసి కారకులను గుర్తించి వారిపై తగిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

ఆర్టీసీలో రాయితీ పథకం

- ఇప్పుడు కొత్తగా టీ9–30 టికెట్
- నేటి నుంచి ప్రయాణికులకు అందుబాటులో..
- ఉదయం 9 గంటల నుంచి రాత్రి 9 వరకు ప్రయాణం

స్టేషన్ మహబూబ్‌నగర్: ప్రయాణికుల సౌకర్యార్థం ఆర్టీసీ సంస్థ ఎన్నో రాయితీలను కల్పిస్తోంది. కొత్తగా ఇప్పుడు టీ9–30 టికెట్‌ను అందుబాటులోకి తెచ్చింది. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో స్వల్ప దూరం ప్రయాణించే వారి కోసం మరో రాయితీ పథకాన్ని ప్రకటించింది. గురువారం నుంచి ఈ టికెట్ అమల్లోకి వస్తుంది. రూ.50లతో టీ9–30 టికెట్ కొనుగోలు చేస్తే పల్లె వెలుగు బస్సుల్లో 30 కిలోమీటర్ల వరకు ఉదయం 9 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు రాను, పోను ప్రయాణించే వెసులుబాటు కల్పిస్తోంది. ఈ టికెట్ ద్వారా ఒక్కొక్కరికి రూ.10 నుంచి రూ.30 వరకు ఆదా అవుతుంది. పల్లె వెలుగు బస్సు కండక్టర్ వద్ద టీ9 టికెట్ అందుబాటులో ఉంటుంది. ఈ టికెట్ తీసుకున్న ప్రయాణికులు తిరుగు ప్రయాణంలో రూ.20 కాంబి టికెట్ తీసుకొని ఎక్స్‌ప్రెస్ సర్వీసుల్లో ప్రయాణించవచ్చు. నెలరోజుల పాటు ఈ టికెట్ అందుబాటులో ఉంటుంది.

అందరికి టీ9–60 టికెట్ వర్తింపు..

గత నెలలో అందుబాటులోకి తెచ్చిన టీ9–60 టికెట్‌ను బస్సుల్లో ప్రయాణించే వారందరికీ వర్తింపజేయనున్నారు. గతంలో ఈ టికెట్ మహిళలు, సీనియర్ సిటిజన్ల కోసం ఉండగా నేటి నుంచి పురుషులకు కూడా వర్తింపజేయనున్నారు. టీ9–30 టికెట్‌ను ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని ఆర్టీసీ రీజినల్ మేనేజర్ వీ శ్రీదేవి తెలిపారు. టీ9–60 టికెట్ నేటి నుంచి అందరికి అందుబాటులో ఉంటుందని తెలిపారు. రీజియన్‌లో టీ9–60 టికెట్‌కు విశేష స్పందన లభించిందని, ఇప్పటి వరకు 4297 టికెట్లను ప్రయాణికులకు అందజేసినట్లు ఆమె తెలిపారు.

విస్తృతంగా ఎక్సైజ్ దాడులు



ఎక్సైజ్ దాడుల్లో పట్టుబడ్డ వాహనాలు, బెల్లం సంచులు

కల్వకుర్తి: కల్వకుర్తి ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో బుధవారం విస్తృతంగా ఎక్సైజ్ దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 2 స్కూటీలు, ఒక బైక్ సీజ్ చేసి, 10 లీటర్ల నాటుసార, 150 కేజీల నల్లబెల్లం, 15 కేజీల పటిక స్వాధీనం చేసుకున్నారు. రెండోసారి పట్టుబడిన వెంకటాపూర్ తండాకు చెందిన చాంగోలిని తహసీల్దార్ రాంరెడ్డి ముందు హాజరుపరిచారు. లక్ష రూపాయల జరిమానా విధించినట్లు ఎక్సైజ్ సీఐ శంకర్ తెలిపారు. దాడుల్లో 5 కేసులు నమోదు కాగా, 2 స్కూటీలు, ఒక బైక్ స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ తెలిపారు. డీటీఎఫ్, ఎన్‌ఫోర్స్‌మెంట్, ఎక్సైజ్ సంయుక్త ఆధ్వర్యంలో విస్తృత దాడులు నిర్వహించినట్లు ఆయన తెలిపారు. ఈ దాడుల్లో సీఐలు రమణయ్య, పరమేశ్, శంకర్, ఎస్ఐలు వెంకటేష్, విజయ్‌కుమార్, అరుణ, దిలీప్‌కుమార్‌రెడ్డి, స్వర్ణలత, ఎక్సైజ్ కానిస్టేబుల్ పాల్గొన్నారు.


బైక్ దొంగల అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న సీఐ ఆంజనేయులు

కల్వకుర్తి టౌన్: బైక్‌లు దొంగిలించే ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ ఆంజనేయులు తెలిపారు. బుధవారం తన కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో పూర్తి వివరాలు వెల్లడించారు. పట్టణానికి చెందిన సతీష్‌కుమార్, సైదులు అలియాస్ స్వామి గతంలో రోడ్డు పక్కన ఉండే పాన్‌షాప్‌లలో సిగరెట్లు, అందులోని చిల్లరను దొంగిలించే వారు. జల్సాలకు అలవాటు పడి డబ్బులు సరిపోక చిల్లర దొంగతనాలను వదిలేసి బైక్‌లు ఎత్తుకెళ్లడం ప్రారంభించారు. బుధవారం ఉదయం పోలీస్‌స్టేషన్ ఎదుట వాహన తనిఖీ చేపడుతుండగా పోలీసులను చూసి పారిపోతున్నారు. వీరిపై పాత కేసులు ఉండటంతో అనుమానం వచ్చి వెంబడించి పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చి విచారించగా బైక్ దొంగతనాలకు పాల్పడుతున్నట్లు ఒప్పుకున్నారు. వారి నుంచి రెండు బైక్‌లను స్వాధీనం చేసుకొని కల్వకుర్తి కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి కావ్య రిమాండ్ విధించింది. మహబూబ్‌నగర్ జిల్లా జైలుకు తరలించినట్లు పోలీసులు తెలిపారు. దొంగలను చాకచక్యంగా పట్టుకున్న ఎస్ఐలు రమేష్, రాజుతో పాటు సిబ్బంది నజీర్, చిరంజీవి, లక్ష్మణ్‌ను కల్వకుర్తి డీఎస్పీ శంకరయ్య అభినందించారు.

గొర్రెలను అడ్డుకోవడంతో ఆందోళన



చెక్‌పోస్టు వద్ద గొర్రెలను అడ్డుకున్న అధికారులు

మన్ననూర్: అడవినే నమ్ముకుని జీవిస్తున్న గొర్రెల కాపరులపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతూ గొర్రెలను అడవుల్లోకి రానివ్వకుండా అడ్డుకోవడం అన్యాయమని యాదవ సంఘం జిల్లా నాయకుడు కాశన్న యాదవ్ అన్నారు. బుధవారం మంగనూర్, మక్తల్‌కు సంబంధించిన గొర్రెల కాపరులు గొర్రెలను తీసుకెళ్తుండగా అమ్రాబాద్ మండలం మన్ననూర్ చెక్‌పోస్టు వద్ద అటవీశాఖ అధికారులు అడ్డుకున్నట్లు పేర్కొన్నారు. కాపరులు బతిమలాడినా వదలకుండా తీవ్ర ఇబ్బందులకు గురి చేశారని అన్నారు. దీంతో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చెక్‌పోస్టు వద్ద ఆందోళన చేయడంతో గొర్రెలు అడవిలో మేపడానికి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు షరతులతో కూడిన అనుమతి ఇచ్చారని తెలిపారు. కార్యక్రమంలో అచ్చంపేట మాజీ ఎంపీపీ రామనాథం, నాయకులు సంతోష్, లడ్డు యాదవ్, మహేష్ యాదవ్, శివ, తుల్జా తదితరులు పాల్గొన్నారు.

బైక్ ఢీకొని చిన్నారికి గాయాలు

అచ్చంపేట రూరల్: అతివేగంగా బైక్‌పై వస్తూ చిన్నారిని ఢీకొట్టిన ఘటనలో వాహనదారుడిపై బుధవారం సిద్దాపూర్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసుల వివరాల ప్రకారం.. ఈనెల 22న శనివారం మండలంలోని కొత్రతండా వద్ద అమ్ములు(6)ను దర్శన్‌గడ్డకు చెందిన యుగంధర్ బైక్ వస్తూ ఢీకొట్టాడు. దీంతో చిన్నారికి గాయాలయ్యాయి. చిన్నారి తల్లి చిన్ని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సిద్దాపూర్ ఎస్ఐ శేఖర్‌గౌడ్ తెలిపారు.

ఫోన్‌లో ఎక్సైజ్ కానిస్టేబుల్‌కు వేధింపులు


జడ్చర్ల: ఓ యాప్‌ను ఉపయోగించి సెల్ నంబర్ కనిపించకుండా ఎవరికైనా ఫోన్ చేసే అవకాశం ఉంది. ఆ యాప్‌ను ఉపయోగించి ఉద్యోగినిని తరుచుగా ఫోన్‌లో వేధిస్తున్న యువకుడిని గుర్తించి పోలీసులు కేసు నమోదు చేసిన ఘటన జడ్చర్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం చోటుచేసుకుంది. సీఐ రమేశ్‌బాబు కథనం ప్రకారం.. జడ్చర్లకు చెందిన ఎక్సైజ్ మహిళా కానిస్టేబుల్ నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజీపేట మండల కేంద్రంలోని మద్యం డిపోలో విధులు నిర్వహిస్తోంది. ఈ క్రమంలో తన ఫోన్‌కు ఓ గుర్తు తెలియని ఫోన్ నంబర్‌తో ఓ వ్యక్తి మాట్లాడుతూ తనను పెళ్లి చేసుకోవాలని ఒత్తిడి తీసుకొచ్చాడు. ఫోన్ చేసిన ప్రతి సారీ విదేశాల మాదిరిగా కొత్త నంబర్ రావడంతో ఎక్కడి నుంచి ఫోన్ వచ్చిందో తెలియని పరిస్థితి. 5 నెలలుగా ఫోన్‌లో వేధింపులు భరించిన యువతి అపరిచిత వ్యక్తిని ఎలా గుర్తించాలో తెలియని సంకటస్థితిలో మానసిక వేదనకు గురైంది. తాను ఎప్పుడు ఎక్కడ ఉన్న విషయం ఫోన్‌లో వివరిస్తుండడంతో ఆశ్చర్యం, అయోమయం ఏర్పడింది. అసభ్యంగా మాట్లాడడంతో పాటు తాను ప్రేమిస్తున్నానని, తనను పెళ్లి చేసుకోవాలంటూ ఒత్తిడి చేయడంతో ఈ విషయాన్ని ఆమె భర్తకు వివరించింది. ఓ సారి భర్త కూడా ఫోన్ వచ్చిన సమయంలో అతనితో మాట్లాడినా అతనిలో మార్పు రాలేదు. ఫోన్‌లో వేధింపులు ఎక్కువయ్యాయి. మద్యం డిపోలో పనిచేస్తున్న కూలీలను, ఉద్యోగులను అనుమానించినా గుర్తించే పరిస్థితి లేకపోయింది. చివరకు సదరు వ్యక్తికి అనుమానం రాకుండా తాను కూడా ప్రేమిస్తున్నానంటూ నమ్మబలికింది. పెళ్లి చేసుకుందామని నమ్మించి అతనిని గుర్తించి ఒక్కసారిగా అవాక్కైంది. ఇన్నాళ్లు తనను ఫోన్‌లో వేధించిన వ్యక్తి తాను పనిచేసే మద్యం డిపోలో హమాలీ నాగరాజుగా గుర్తించడంతో వెంటనే జడ్చర్ల పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి తిమ్మాజీపేటకు బదిలీ చేశామని సీఐ తెలిపారు.

అడవి పందిని చంపితే రూ.5 లక్షలు జరిమానా

లింగాల: అడవి జంతువులను ఏ రకంగా చంపినా అటవీ శాఖ కొత్త చట్టం ప్రకారం పట్టుబడితే కేసుతో పాటు రూ. 1 లక్ష నుంచి రూ.5 లక్షల వరకు జరిమానా విధించనున్నట్లు అటవీ శాఖ వారు పేర్కొన్నారు. ఇటీవల మండల పరిధిలోని అంబట్‌పల్లికి చెందిన వ్యక్తి అడవి పందిని చంపడంతో అటవీశాఖ అధికారులు దాన్ని స్వాధీనం చేసుకుని అతనితో రూ.లక్ష జరిమానా వసూలు చేసిన విషయం ఆలస్యంగా తెలిసింది. పెద్దకొత్తపల్లి మండలం ఆదిరాల దగ్గర రైతు పంట పొలాన్ని రక్షించుకోవడానికి పొలం చుట్టూ విద్యుత్ తీగలతో షాక్‌ను ఏర్పాటు చేశాడు. తీగలకు తగిలిన పంది చనిపోయింది. దాన్ని అంబట్‌పల్లికి చెందిన వ్యక్తి కొనుగోలు చేసి తీసుకొస్తున్న క్రమంలో అటవీ శాఖ స్పెషల్ పార్టీ వారు పట్టుకున్నారు. దీంతో అతనిపై కేసు నమోదు చేసి రూ.లక్ష జరిమానా వసూల్ చేశారు. ఈ విషయాన్ని అటవీ శాఖకు చెందిన ఓ అధికారి ధృవీకరించారు. ప్రస్తుతం పంట సాగు సీజన్ కావడంతో పొలాల రైతులు అడవిపందుల నుంచి పంటలను రక్షించుకోవడానికి విద్యుత్ తీగలు ఏర్పాటు చేస్తున్నారు. మరి కొందరు వేటగాళ్లు వేటనే తమ వృత్తిగా ఎంచుకొని కొనసాగిస్తుంటారు. అటవీ శాఖ కొత్తగా రూపొందించిన చట్టం కఠినంగా ఉండడంతో రైతులు, వేటగాళ్లు అడవి జంతువులను చంపే ప్రయత్నాలు మానుకోవాలి. లేదంటే భారీగా జరిమానా చెల్లించాల్సి వస్తుంది.

పాలమూరు ప్రజాభేరి సభను విజయవంతం చేద్దాం

- మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు



మాట్లాడుతున్న జూపల్లి కృష్ణారావు

కొల్లాపూర్: కొల్లాపూర్‌లో నిర్వహించే పాలమూరు ప్రజాభేరి సభను విజయవంతం చేసేందుకు పార్టీ శ్రేణులు సిద్ధం కావాలని మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. సభ నిర్వహణపై చర్చించేందుకు బుధవారం కొల్లాపూర్‌లో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి డీసీసీ అధ్యక్షుడు వంశీకృష్ణ, టీపీసీసీ జనరల్ సెక్రటరీ రంగినేని అభిలాష్‌రావు హాజరయ్యారు. వంశీకృష్ణ మాట్లాడుతూ 40 ఏండ్ల క్రితం ఇందిరాగాంధీ కొల్లాపూర్‌కు వచ్చారని, ఇప్పుడు ఆమె మనుమరాలు ప్రియాంక గాంధీ రాబోతున్నారన్నారు. సభలో మహిళా డిక్లరేషన్‌తో పాటు పలు హామీలను ప్రియాంకగాంధీ ప్రకటిస్తారని వెల్లడించారు. జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ 30వ తేదీ వరకు వర్షాలు తగ్గుతాయన్నారు. ఒక వేళ వర్షాలు కురిసినా అదరొద్దు, బెదరొద్దని, సభను విజయవంతం చేసేందుకు తరలిరావాలని పార్టీ శ్రేణులకు సూచించారు. 2,500 మంది సభ్యులతో నియోజకవర్గ వ్యాప్తంగా బూతు కమిటీలను ఏర్పాటు చేశామని, ఒక్కో సభ్యుడు 25 నుంచి 30 మందిని సభకు తీసుకురావాలన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడేందుకు పాలమూరు ప్రజాభేరి సభ దోహదం కాబోతుందన్నారు. ఈ సభలోనే బీఆర్‌ఎస్ నాయకుల బండారం బయటపెడతామన్నారు. ఇక్కడి నుంచే బీఆర్‌ఎస్ పతనానికి నాంది పలుకుదామన్నారు. సమావేశంలో నాయకులు రంగినేని జగదీశ్వరుడు, రాము యాదవ్, సూర్యప్రతాప్‌గౌడ్, రామ్మోహన్‌రావు, దండు నర్సింహ, రఘుపతిరావు, బిచ్చారావు, శేఖర్‌రెడ్డి, పసుపుల నర్సింహ, రఫియోద్దీన్, తగిలి కృష్ణ తదితరులున్నారు.

కాంగ్రెస్ అభ్యర్థిగా నేనే పోటీలో ఉంటా : సీజేఆర్



జగదీశ్వర్‌రావు

కొల్లాపూర్: కొల్లాపూర్ అసెంబ్లీ స్థానం నుంచి రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా తానే పోటీలో ఉంటానని ఆ పార్టీ నేత చింతలపల్లి జగదీశ్వర్‌రావు వెల్లడించారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మహబూబ్‌నగర్‌లో మంగళవారం నిర్వహించిన పాలమూరు ప్రజాభేరి సన్నాహక సమావేశంలో తాను మాట్లాడిన మాటలను వక్రీకరించి మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు అనుచరులు సోషల్‌మీడిలో పోస్టులు పెడుతున్నారని ఆయన ఆరోపించారు. ఏఐసీసీ నాయకులు మన్సూర్ అలీఖాన్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలోకి ఎవరు వచ్చినా స్వాగతిస్తాం, జూపల్లిగారిపై నేను రెండు సార్లు పోటీచేసి ఓడిపోయాను అని చెప్పుకునేందుకు సిగ్గుపడను అని మాత్రమే మాట్లాడడం జరిగిందన్నారు. దీన్ని జూపల్లి అనుచరులు వక్రీకరిస్తూ జూపల్లిపై రెండుసార్లు ఓడిపోయినందుకు సిగ్గుపడుతున్నా అని, ఆయనతో నేను సయోధ్య కుదుర్చుకున్నట్లు తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ఇటువంటి తప్పుడు ప్రచారాలను పార్టీ శ్రేణులు నమ్మొద్దన్నారు. పార్టీకోసం కష్టపడ్డానని, తప్పకుండా టికెట్ తనకే వస్తుందన్నారు గెలిచేది తానే అని ఆయన వెల్లడించారు.

ఇంట్లో చోరీ

వనపర్తి: జిల్లా కేంద్రంలోని ప్యాటగడ్డ కాలనీలో తాళం వేసిన ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు చొరబడి తొమ్మిది తులాల బంగారం అపహరించుకుపోయిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. ఎస్ఐ యుగంధర్‌రెడ్డి కథనం ప్రకారం.. ప్యాటగడ్డ కాలనీలో నివాసం ఉంటున్న నందిమల్ల పరమయ్య ఇటీవల మృతి చెందాడు. కుటుంబ యజమాన్ని మృతి చెందడంతో ఇంట్లో కొన్ని రోజులు ఎవరూ ఉండొద్దని కుటుంబసభ్యులు పొలం వద్ద నందిమల్లగడ్డ ప్రాంతంలో నివాసం ఉంటున్నారు. ఇంటికి తాళం వేసి వెళ్లిపోయారు. దీన్ని గమనించి దుండగులు ఇంట్లో చోరీకి పాల్పడ్డారు. బాధితురాలు శాంతమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అసభ్యకర పోస్టులు పెట్టిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలి : ఎమ్మెల్సీ

నాగర్‌కర్నూల్ క్రైం: సోషల్ మీడియాలో అసభ్యకరమైన పోస్టులు పెట్టిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని ఎంఎల్‌సీ కూచకుళ్ల దామోదర్‌రెడ్డి బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఫిర్యాదులో వివరాల ప్రకారం.. సోషల్ మీడియాలో విగ్నేష్ అనే వ్యక్తి తనతో పాటు తన కుమారుడుపై అసభ్యకరంగా ఈనెల 16న పోస్టులు పెట్టారని, రాజకీయంగా అవమానించే పోస్టింగ్‌లు పెట్టారని, పోస్టింగ్ పెట్టిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయంపై విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ మహేందర్ తెలిపారు.

క్లుప్తంగా...

ఐఎంఏ సైంటిఫిక్ కమిటీ కన్వీనర్‌గా డా.కిరణ్

సాక్షి, హైదరాబాద్: ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) తెలంగాణ రాష్ట్ర సైంటిఫిక్ కమిటీ కన్వీనర్‌గా డాక్టర్ కిరణ్ మాదల నియమితులయ్యారు. ఈ మేరకు ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ బీఎన్ రావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కమిటీకి చైర్మన్‌గా డాక్టర్ డీసీ తిరుపతిరావు, కో చైర్మన్‌గా డాక్టర్ శ్రీరంగ్ అబ్కారీ, సభ్యులుగా డాక్టర్లు శశికళారెడ్డి, రామనర్సింహారెడ్డి, ఎంఎస్ఎస్ ముఖర్జీ, టి.సుబ్రమణ్యేశ్వరరావు, పి.దత్తాత్రేయ, పవన్‌కుమార్, చిన్మయి రాత, ఎంవీ రావు, శ్రీభూషణ్ రాజు ఉన్నారు.

5 నుంచి రాష్ట్ర పీజీ మెడికల్ కౌన్సెలింగ్



సాక్షి, హైదరాబాద్: వచ్చే నెల 5వ తేదీ నుంచి మొదటి విడత రాష్ట్రస్థాయి కోటా మెడికల్ పీజీ (ఎండీ, ఎంఎస్, డిప్లొమా, ఎండీఎస్, పీజీ డీఎన్‌బీ) సీట్లకు కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం తెలిపింది. జాతీయ వైద్య కమిషన్ (ఎన్‌ఎంసీ) ఆదేశాల మేరకు ఆగస్టు 16 వరకు కౌన్సెలింగ్ జరుగనుంది. ఇందులో సీట్లు పొందినవారు 20, 21 తేదీల్లో చేరాలి. ఇక రెండో విడత కౌన్సెలింగ్ వచ్చే నెల 25 నుంచి సెప్టెంబర్ 6 వరకు నిర్వహించనున్నారు. వాటిల్లో సీట్లు పొందినవారు సెప్టెంబర్ 11, 12వ తేదీల్లో చేరాలి. ఇక మూడో విడత కౌన్సెలింగ్ సెప్టెంబర్ 16 నుంచి 26వ వరకు జరగనుంది. అందులో సీట్లు పొందినవారు సెప్టెంబర్ 30 నుంచి అక్టోబర్ ఒకటో తేదీ మధ్య చేరాలి. స్ట్రే వేకెన్సీ (తుది విడత) కౌన్సెలింగ్ అక్టోబర్ 1 నుంచి పదో తేదీ వరకు జరుగుతుంది. అందులో సీట్లు పొందినవారు పదో తేదీనే చేరాల్సి ఉంటుంది. తరగతులు సెప్టెంబర్ 5 నుంచే జరుగుతాయని ఎన్‌ఎంసీ తెలిపింది.

ఓయూ దూరవిద్య ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశాలు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ ప్రొఫెసర్ జి.రామిరెడ్డి దూరవిద్య కేంద్రంలో 2023–24 విద్యా సంవత్సరానికి రెండేళ్ల ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఓయూ పీజీ అడ్మిషన్స్ డైరెక్టర్ ప్రొ. పాండురంగారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మరిన్ని వివరాలకు osmania.ac.inలోచూడవచ్చని వివరించారు.

ఏఎన్‌ఎం పోస్టులు 1520

భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసిన మెడికల్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు

సాక్షి, హైదరాబాద్: వైద్యారోగ్యశాఖలో ఏఎన్‌ఎం (మల్టీ పర్పస్ హెల్త్ అసిస్టెంట్-ఫిమేల్) పోస్టుల భర్తీకి ప్రకటన జారీ అయ్యింది. మెడికల్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు సభ్యకార్యదర్శి గోపీకాంత్‌రెడ్డి బుధవారం నోటిఫికేషన్ విడుదల చేశారు. ఆన్‌లైన్‌లోనే దరఖాస్తులు సమర్పించాలి. రాతపరీక్ష ఇంగ్లిష్‌లో ఉంటుంది. పేస్కేల్ రూ. 31,040 నుంచి రూ.92,050 మధ్య ఉంటుంది. బహుళ ఐచ్ఛిక ఎంపిక విధానంలో రాతపరీక్ష ప్రాతిపదికన ఓఎంఆర్ లేదా కంప్యూటర్ ఆధారిత పరీక్ష ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. అయితే ఈ రెండు పద్ధతుల్లో ఏ విధంగా పరీక్ష నిర్వహిస్తారన్న దానిపై త్వరలో వెల్లడిస్తామని గోపీకాంత్‌రెడ్డి తెలిపారు. దరఖాస్తు రుసుము రూ. 500, ప్రాసెసింగ్ ఫీజు రూ.200 చెల్లించాల్సి ఉంటుంది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్, పీహెచ్ తదితర కేటగిరీలకు మినహాయింపు ఉంటుంది.

మొత్తం పోస్టులు: 1520 (ఫిమేల్)
దరఖాస్తుల స్వీకరణ: వచ్చేనెల 25న ఉదయం 10:30 నుంచి
దరఖాస్తులకు చివరి తేదీ : సెప్టెంబర్ 19వ తేదీ సాయంత్రం 5:30 వరకు
పరీక్ష కేంద్రాలు : హైదరాబాద్, వరంగల్, ఖమ్మం, నిజామాబాద్

ఇవీ అర్హతలు:

- అభ్యర్థులు తప్పనిసరిగా మల్టీపర్పస్ హెల్త్ వర్కర్ (ఫిమేల్) ట్రైనింగ్ కోర్సు చేసి ఉండాలి. లేదా ఇంటర్‌లో మల్టీపర్పస్ హెల్త్ వర్కర్ (ఫిమేల్) శిక్షణ కోర్సు పాసై ఉండాలి.
- తెలంగాణ రాష్ట్ర నర్సెస్ అండ్ మిడ్‌వైఫ్స్ కౌన్సిల్‌లో రిజిస్టర్ చేసుకొని ఉండాలి.
- నిర్ధారించిన ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఏడాదిపాటు క్లినికల్ ట్రైనింగ్ చేసి ఉండాలి. లేదా గుర్తించిన ఆస్పత్రుల్లో ఏడాది అప్రెంటిషిప్ పూర్తి చేసి ఉండాలి. వారు తెలంగాణ పారామెడికల్ బోర్డులో రిజిస్టర్ చేసుకొని ఉండాలి. ఎవరైనా అభ్యర్థి ఈ అర్హతలకు సమానమైన ఇతర అర్హతలను కలిగి ఉంటే, ఆ విషయాన్ని బోర్డు ఏర్పాటు చేసిన నిపుణుల కమిటీకి రిఫర్ చేస్తారు. ఆ కమిటీ నివేదిక ఆధారంగా బోర్డు తుది నిర్ణయం తీసుకుంటుంది.
- దరఖాస్తుదారులు 18 - 44 ఏళ్ల మధ్యలో ఉండాలి. వివిధ వర్గాలకు సంబంధించి వారికి ప్రభుత్వం నిర్ణయించిన వయోపరిమితి సడలింపులు వర్తిస్తాయి.



- పరీక్షలో మార్కులకు గరిష్ఠంగా 80 పాయింట్లు ఉంటాయి. వైద్యారోగ్యశాఖలో కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగిగా పనిచేసిన/చేస్తున్న వారికి గరిష్ఠంగా 20 పాయింట్ల వరకు అదనంగా ఇస్తారు.
- గిరిజన ప్రాంతాల్లో సేవలు అందించినవారికి ప్రతి 6 నెలలకు 2.5 పాయింట్ల చొప్పున, గిరిజనేతర ప్రాంతాల్లో అయితే 2 పాయింట్ల చొప్పున కేటాయిస్తారు.
- కాంట్రాక్టు/ఔట్‌సోర్సింగ్ అనుభవమున్న వారు ధ్రువీకరణపత్రాన్ని పొందిన తర్వాత ఆ వివరాలతో దరఖాస్తు చేసుకోవాలి.
- కాంట్రాక్టు/ఔట్‌సోర్సింగ్ ఏ సేవలు అందించి ఉంటే, ఆ కేటగిరీ పోస్టులకు మాత్రమే పాయింట్లు వర్తింపజేస్తారు.

అప్‌లోడ్ చేయాల్సినవి :

అభ్యర్థులు ఆన్‌లైన్ దరఖాస్తులో వివరాలు నమోదు చేయడంతోపాటు అవసరమైన పత్రాల సాఫ్ట్ కాపీ (పీడీఎఫ్)లను అప్‌లోడ్ చేయాలి. ఆధార్ కార్డ్, పదోతరగతి సర్టిఫికెట్, అర్హత సాధించిన కోర్సులకు చెందిన సర్టిఫికెట్లు ఉండాలి. అనుభవ ధ్రువీకరణ పత్రం (వర్తిస్తే), స్థానికత గుర్తింపు కోసం 1 నుంచి 7వ తరగతి వరకు చదివిన సర్టిఫికెట్లు లేదా నివాస ధ్రువీకరణపత్రం, ఎస్సీ, ఎస్టీ, బీసీలైతే కులధ్రువీకరణ పత్రం, బీసీల విషయంలో తాజా నాన్-క్రిమీలేయర్ సర్టిఫికెట్, ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ కోరేవారు తాజా ఆదాయం, ఆస్తి సర్టిఫికెట్, స్పోర్ట్స్ సర్టిఫికెట్, సదరం నుంచి దివ్యాంగ సర్టిఫికెట్, ఎన్‌సీసీ ధ్రువీకరణపత్రం వంటివి అవసరాన్ని బట్టి జత చేయాల్సి ఉంటుంది.

జోన్లవారీగా స్థానికులకు 95 శాతం రిజర్వేషన్

ఏఎన్‌ఎం పోస్టులను జోన్లవారీగా భర్తీ చేస్తారు. ఆయా జోన్ల అభ్యర్థులకే 95% పోస్టులు కేటాయిస్తారు. మిగతావి ఓపెన్ కేటగిరీలో భర్తీ చేస్తారు.

- జోన్-1 (కాళేశ్వరం)లో ఆసిఫాబాద్, మంచిర్యాల, పెద్దపల్లి, భూపాలపల్లి,ములుగు జిల్లాలు.
- జోన్-2 (బాసర)లో ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల
- జోన్-3 (రాజన్న)లో కరీంనగర్, సిరిసిల్ల, సిద్దిపేట, మెదక్, కామారెడ్డి
- జోన్-4 (భద్రాద్రి)లో కొత్తగూడెం, ఖమ్మం , మహబూబాబాద్, హనుమకొండ, వరంగల్
- జోన్-5(యాదాద్రి)లో సూర్యాపేట, నల్లగొండ, భువనగిరి, జనగాం
- జోన్-6(చార్మినార్)లో మేడ్చల్ మల్కాజిగిరి, హైదరాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి, వికారాబాద్
- జోన్-7(జోగులాంబ)లో మహబూబ్‌నగర్, నారాయణపేట, జోగుళాంబ-గద్వాల, వనపర్తి, నాగర్ కర్నూల్ జిల్లాలున్నాయి.

వివిధ జోన్లు, కేటగిరీల వారీగా పోస్టుల వివరాల పట్టిక...

కేటగిరీ	జోన్-1	జోన్-2	జోన్-3	జోన్-4	జోన్-5	జోన్-6	జోన్-7	మొత్తం
ఓసీ	49	68	78	72	71	56	57	451
ఈడబ్ల్యూఎస్	18	23	27	24	25	19	21	157
బీసీ-ఏ	14	16	20	17	19	14	13	113
బీసీ-బీ	15	21	25	23	23	18	21	146
బీసీ-సీ	2	3	2	3	2	2	1	15
బీసీ-డీ	12	15	19	16	16	14	13	105
బీసీ-ఈ	7	9	11	9	10	8	7	61
ఎస్సీ	25	33	38	35	35	27	29	222
ఎస్టీ	17	23	27	24	25	20	21	157
స్పోర్ట్స్	3	4	5	4	5	3	4	28
ఓహెచ్	7	10	11	10	10	8	9	65
మొత్తం	169	225	263	237	241	189	196	1520

ఓహెచ్: ఆర్థోపెడిక్ హ్యాండిక్యాప్

'పల్లెవెలుగు'లో మరో రాయితీ టికెట్

30 కి.మీ. పరిధిలో రూ.50కే రానుపోను సదుపాయం

సాక్షి, హైదరాబాద్: గ్రామీణ ప్రాంతాల్లో ఆటోల్లో వెళ్లే ప్రయాణికులను బస్సుల వైపు మళ్లించేందుకు ఆర్టీసీ చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా కొత్తగా పల్లె వెలుగు బస్సుల్లో 30 కి.మీ. దూరం ప్రయాణించే వారికి రాయితీ టికెట్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. కొద్ది రోజుల క్రితం సంస్థ టీ9–60 పేరుతో పల్లెవెలుగు బస్సుల్లో 60 కి.మీ. పరిధిలో తిరిగే ప్రయాణికులకు రూ.100కే రానుపోను రాయితీ టికెట్‌ను అందుబాటులోకి తెచ్చిన విషయం తెలిసిందే. దానికి స్పందన తక్కువగా ఉండటంతో, ఇప్పుడు టీ9–30 పేరుతో 30 కి.మీ. పరిధిలో తిరిగే వారికి రూ.50కే రానుపోను వర్తించేలా రాయితీ టికెట్‌ను ప్రారంభించింది. ఈ టికెట్లు గురువారం నుంచి కండక్టర్ల వద్ద అందుబాటులో ఉంటాయని ఆర్టీసీ వర్గాలు తెలిపాయి.

ఆటోల్లో ప్రయాణించేవారిపై గురి..

చాలా ప్రాంతాల్లో ప్రజలు ఆటోలను ఆశ్రయిస్తున్నారు. పల్లెవెలుగు బస్సు టికెట్‌పై రాయితీ ప్రకటిస్తే వారిలో కొందరైనా బస్సులెక్కు తారని ఆర్టీసీ భావిస్తోంది. ప్రస్తుతం పల్లెవెలుగు బస్సుల్లో 30 కి.మీ. నిడివిలో ప్రయాణించే వారి సంఖ్య దాదాపు మూడున్నర లక్షలుగా ఉంది. అంతకు రెట్టింపు జనం అదే పరిధిలో ఆటోల్లో ప్రయాణిస్తున్నారు. ఇప్పుడు కొత్తగా తెచ్చిన రాయితీ టికెట్ తీసుకుంటే.. రూ.50తో గమ్యం వెళ్లితిరిగి రావచ్చు. దానికి అదనంగా రూ.20 చెల్లించి కాంబి టికెట్ తీసుకుంటే ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో కూడా అదే టికెట్‌తో రాను, పోనూ ప్రయాణించవచ్చు. కొద్ది రోజుల క్రితం 60 కి.మీ. నిడివిలో ప్రయాణించేవారికోసం రూ.100కే రానుపోను టికెట్ తీసుకురాగా, 60 కి.మీ. పరిధిలో తిరిగే ప్రయాణికుల సంఖ్య తక్కువగా ఉండటంతో దానికి పెద్దగా స్పందన రాలేదు. ఈ నేపథ్యంలో చాలా మంది డిపో మేనేజర్లు కోరటంతో కొత్త విధానం ప్రారంభించారు. ఉదయం 9 నుంచి రాత్రి 9 వరకు ఈ టికెట్ చెల్లుబాటులో ఉంటుంది. సాయంత్రం 6 వరకు టికెట్ల జారీ ఉంటుంది. 30 కి.మీ. పరిధిలో పొరుగు రాష్ట్రంలో ప్రయాణం ఉంటే.. అక్కడ కూడా ఇది చెల్లుబాటు (టీఎస్‌ఆర్టీసీ బస్సుల్లోనే) అవుతుందని అధికారులు ప్రకటించారు. ఈ కొత్త టికెట్‌కు సంబంధించిన పోస్టర్‌ను బుధవారం బస్‌భవన్‌లో ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి, ఎండీ సజ్జనార్‌లు ఆవిష్కరించారు.

ఎంబీబీఎస్ అర్హుల జాబితా విడుదల

సాక్షి, హైదరాబాద్: ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల్లో కన్వీనర్ కోటా సీట్లకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల అర్హుల జాబితాను కాళోజీ నారాయణ రావు ఆరోగ్య విశ్వవిద్యాలయం బుధవారం విడుదల చేసింది. కన్వీనర్ కోటా సీట్ల కోసం దరఖాస్తు చేసిన అభ్యర్థుల సర్టిఫికెట్లను పరిశీలించిన అనంతరం ఈ జాబితాను విడుదల చేసినట్లు కాళోజీ వర్సిటీ వర్గాలు వెల్లడించాయి. మొత్తం 22,167 మంది అర్హత సాధించారని వర్సిటీ తెలిపింది. అర్హత జాబితాపై ఎవరికైనా అభ్యంతరాలుంటే ఈ నెల 29న సాయంత్రం 4 గంటల్లోపు knrugadmission@gmail.comకు తెలియజేయాలని సూచించింది. కాగా, వెబ్ కౌన్సెలింగ్‌కు నోటిఫికేషన్ అనంతరం వీరు తమకు ఇష్టమైన కాలేజీలను ఎంపిక చేసుకోవచ్చని, వారికి వచ్చిన ర్యాంకు ఆధారంగా సీట్లను కేటాయించనున్నట్లు వెల్లడించింది.

'ఓఆర్ఆర్ లీజు' సమాచారం ఇవ్వడం లేదు

- గత నెల 14న దరఖాస్తు చేసినా అధికారులు స్పందించడంలేదు
- హైకోర్టులో టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి పిటిషన్



సాక్షి, హైదరాబాద్: నెహ్రూ ఔటర్ రింగ్ రోడ్ (ఓఆర్ఆర్) టోల్ నిర్వహణ బదిలీ (టీవోటీ)కి సంబంధించిన సమాచారాన్ని, సమాచార హక్కు చట్ట ప్రకారం కోరినా అధికారులు ఇవ్వడం లేదంటూ టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి బుధవారం హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. గత నెల 14న దరఖాస్తు చేసినా ఇప్పటివరకు అధికారుల నుంచి ఎలాంటి స్పందన లేదన్నారు. అధికారుల తీరు ఆర్టీఐ చట్టంతో పాటు, రాజ్యాంగంలోని ఆర్టికల్ 14ను కూడా ఉల్లంఘించడమే అవుతుందని పేర్కొన్నారు. తాను మే 1న తొలిసారి దరఖాస్తు చేయగా, మే 23న అరకొర సమాచారం మాత్రమే ఇచ్చారని వివరించారు. దీంతో జూన్ 14న మరోసారి దరఖాస్తు చేశానన్నారు. ఓఆర్ఆర్ లీజు నివేదికలు, 30 ఏళ్లకు ఇవ్వడంపై మంత్రిమండలి నిర్ణయం, 2021-22, 2022-23 సంవత్సరాలలో ఆర్జించిన మొత్తం ఆదాయానికి సంబంధించి సమాచారం ఇవ్వాలని కోరినట్లు తెలిపారు. లీజు పారదర్శకంగా జరిగిందా? లేదా? తెలుసుకోవడానికి ఈ సమాచారం కీలకం అన్నారు. మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ ముఖ్య కార్యదర్శి, హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ(హెచ్ఎండీఏ), హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్ ప్రజా సంబంధాల అధికారి, ఎండీ(ఎఫ్ఏసీ)లను ప్రతివాదులుగా పేర్కొన్నారు. ఆర్టీఐ చట్టం ప్రకారం కోరిన సమాచారం ఇచ్చేలా ప్రతివాదులకు ఆదేశాలు జారీ చేయాలని కోరారు. న్యాయవాది తేరా రజనీకాంత్‌రెడ్డి దాఖలు చేసిన ఈ పిటిషన్ నేడు లేదా రేపు విచారణకు రానుంది. ఓఆర్ఆర్ నిర్వహణ, టోలు వసూలు బాధ్యతలను 30 ఏళ్ల పాటు ఐఆర్‌బీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవెలప్‌మెంట్ లిమిటెడ్, ఐఆర్‌బీ గోల్కొండ ఎక్స్‌ప్రెస్ వే లిమిటెడ్‌లకు అప్పగిస్తూ ప్రభుత్వం ఇటీవల నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే.

నవాబుల నజరానే నవాబుపేట!

- కరెంటొచ్చి నవాబుపేటకు రేపటితో 50ఏళ్లు పూర్తి..
- నాడు మాజీ ప్రధాని, మాజీ సీఎం స్వర్గీయ పీవీ విద్యుత్ ప్రారంభం..



నవాబుపేట వ్యూ

నవాబుపేట: స్వాతంత్ర్యానికి పూర్వం నిజాం పాలనలో ఉన్న రాంచంద్రపురం, గురుకుంట, ఇప్పటూర్ ప్రాంతాలను కోనదుర్గంగా ఏర్పాటు చేసుకొని నవాబుపేట కేంద్రంగా నవాబులు పాలించారు. అప్పట్లో నవాబులు ఇక్కడి నుంచి వెళ్తూ అప్పటి వరకు రామచంద్రపురంగా ఉన్న గ్రామాన్ని నజరానగా నవాబుపేటగా నామకరణం చేసినట్లు పూర్వీకులు చెపుతున్నారు. 1953లో ఏర్పడ్డ నవాబుపేట 1972కు పూర్వం వరకు కందిళ్ల వెలుతురులో కాలం గడిపింది.

20 ఏళ్ల తర్వాత విద్యుత్ వచ్చింది..

1953లో విద్యుత్ ఏర్పాటు చేయాలని కోరగా, దాదాపు 20 ఏళ్ల తర్వాత 1972లో పొందగలిగింది. విద్యుత్ లేని రోజుల్లో పంచాయతీకి ఆయిల్ దీపాలే వెలుగునిచ్చేవి. గ్రామంలోని ముఖ్య కూడళ్లలో ఆయిల్ బుడ్డీలు ఏర్పాటు చేసి గ్రామ పంచాయతీ ద్వారా వాటిని సంధ్యా వేళ వెలిగించే వారు. నాడు పీవీ నర్సింహారావు ప్రారంభించిన శిలాఫలకం విద్యుత్ వెలిగించిన చోట అలాగే నేటికీ ఉంది. అనంతరం 1983లో నవాబుపేట మండల కేంద్రంగా ఏర్పాటైంది. నవాబుపేట చరిత్రలో దాదాపు 30 ఏళ్ల పాటు ఏకగ్రీవంగానే సర్పంచ్‌లు ఎన్నుకున్నారు. పైగా ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు అన్నదమ్ములు ఏకంగా 45 ఏళ్లు సర్పంచ్‌లుగా ఉండటం మరో విశేషం.

నాడు నవాబుపేటలో యన్మన్‌గండ్ల, దయపంతులపల్లి గ్రామాలు రెండు కలిసి మేజర్ పంచాయతీగా ఉండేవి. 1995లో నవాబుపేట, యన్మన్‌గండ్లలు ప్రత్యేక పంచాయతీలుగా ఏర్పాటయ్యాయి. 1983 నవాబుపేట మండలంగా ఏర్పాటైంది.

50 ఏళ్ల క్రితం తొలి విద్యుత్ బల్బు వెలిగింది..

1972, జూలై 28వ తేదీన నాటి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు నవాబుపేటలో తొలి విద్యుత్ బల్బును వెలిగించారు. ఆయనతో పాటు నాటి వైద్యశాఖ మంత్రి మహ్మద్ ఇబ్రహీం అలీ అన్సరీ నియోజకవర్గం ఎమ్మెల్యేగా కార్యక్రమానికి విశిష్ట అతిథిగా హాజరయ్యారు. కలెక్టర్ అసాదుల్లా సైయ్యద్, జిల్లాపరిషత్ చైర్మన్ కేకే రెడ్డి, సమితి అధ్యక్షుడు రామకృష్ణారెడ్డిలు పాల్గొనగా, నాటి సర్పంచ్ రంగారావు కార్యక్రమానికి అధ్యక్షత వహించారు.



నాడు సీఎం పీవీ ప్రారంభించిన శిలాఫలకం

సర్పంచ్‌లు నాటి నుంచి నేటి దాకా..

- 1952 - 1962 వరకు లక్ష్మన్‌రావు
- 1962 - 1964 వరకు చెన్నకిష్టన్న
- 1964 - 1981 వరకు రంగారావు
- 1981 - 1994 వరకు ప్రహ్లాద్‌రావు
- 1995 - 2000 వరకు శకుంతల చెంద్రశేఖర్
- 2000 - 2005 వరకు వెంకటయ్య
- 2005 - 2010 వరకు కృష్ణయ్య,
- 2014 - 2019 వరకు నస్కంటి వీరప్ప
- 2019 - గోపాల్‌గౌడ్ తాజాగా కొనసాగుతున్నారు.



నవాబుపేట గ్రామ పంచాయతీ బవనం

అవి ముమ్మాటికీ మధుర స్మృతులే..



30 ఏండ్లు చీకట్లో ఉన్న ప్రజలకు విద్యుత్ వెలుగు రావడంలో అందరి కళ్లల్లో ఆనందం వెలిగిపోయింది. స్వయంగా ముఖ్యమంత్రి రావటం చాలా ఆనందాన్నిచ్చింది. సర్పంచ్‌గా ఉండి పంచాయతీ ద్వారా వచ్చే ఆదాయంతోనే గ్రామ కూడళ్లలో కందిళ్ల ఏర్పాటు చేసి ఆయిల్‌తో రోజూ వాటిని వెలిగించే వాళ్లం. పంచాయతీ పన్నులు అప్పట్లో సైతం 80 శాతం వరకు వసూలయ్యేవి. వాటితోనే ఆయిల్ దీపాలు వీధి దీపాలుగా చేసి దాదాపుగా 30 ఏండ్లు కాలం గడిపాం. నవాబుపేట గ్రామ పంచాయతీ బవనం పక్కనే ఏర్పాటు చేసిన విద్యుత్ పోల్‌కు విద్యుత్ బల్బును పీవీ నర్సింహారావు స్విచ్ ఆన్ చేసి ప్రారంభించారు.

– రంగారావు.
నాటి సర్పంచ్, మాజీ జెడ్పీటీసీ

అభివృద్ధి వైపు అడుగులు..



మండల కేంద్రం అభివృద్ధి వైపు అడుగులు వేస్తోంది. మండల కేంద్రం నుంచి ఎటూ మూడు కిలో మీటర్ల వరకు డబుల్ రోడ్డు నిర్మించాం. మండల కేంద్రంలో ప్రధాన రోడ్డు అభివృద్ధికి ముఖ్య కూడలి ఏర్పాటుకు ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి ప్రత్యేక నిధులు కేటాయించారు. నూతన పంచాయతీ భవనం నిర్మాణం, కోటిన్నర రూపాయలతో సీసీ రోడ్లు, ప్రధాన కూడళ్ల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందించి అంచెలంచెలుగా అభివృద్ధి చేస్తున్నాం.

– గోపాల్‌గౌడ్,
సర్పంచ్ నవాబుపేట

జూరాలకు 30వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో



పూర్తి స్థాయి నీటిమట్టంతో నిండుకుండను తలపిస్తున్న జూరాల ప్రాజెక్టు రిజర్వాయర్

- ఆల్మట్టికి 1,38,473 క్యూసెక్కులు
- ప్రాజెక్టు నుంచి 10,845 క్యూసెక్కులు విడుదల
- రెండు పంపుల ద్వారా నెట్టెంపాడు ఎత్తిపోతల పంపింగ్
- తొమ్మిది యూనిట్లలో విద్యుదుత్పత్తి..

ధరూరు : ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతం నుంచి వస్తున్న ఇన్‌ఫ్లో స్వల్పంగా పెరిగినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. మంగళవారం ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతం నుంచి 10వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, బుధవారం రాత్రి 11గంటలకు 30వేల క్యూసెక్కులు పెరిగినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. నెట్టెంపాడు ఎత్తిపోతల పథకంలో రెండు పంపులను కొనసాగిస్తున్నారు. విద్యుత్ ఉత్పత్తి ద్వారా 29,641 క్యూసెక్కులు, నెట్టెంపాడుకు 1500 క్యూసెక్కులు, జూరాల ఎడమ కాలువకు 640 క్యూసెక్కులు, భీమా లిఫ్టు-2కు 750 క్యూసెక్కులు, భీమా లిఫ్టు -1కు 650 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 69 క్యూసెక్కులు మొత్తం ప్రాజెక్టు నుంచి 32,510 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. జూరాల పూర్తి స్థాయి నీటి మట్టం 9.657టీఎంసీలు కాగా, ప్రస్తుతం ప్రాజెక్టులో 9.050 టీఎంసీల నీరు నిల్వ ఉందని అధికారులు తెలిపారు. ఎగువనున్న ఆల్మట్టి ప్రాజెక్టు నీటి మట్టం 129.72 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 85.55 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఈ ప్రాజెక్టుకు 1,38,473 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. ప్రాజెక్టు నుంచి 14,690 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. నారాయణపూర్ ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 37.64 టీఎంసీలు కాగా, ప్రస్తుతం ప్రాజెక్టులో 22.06 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఈ ప్రాజెక్టుకు 20,041 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, ప్రాజెక్టు నుంచి కేవలం 1,673 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

శ్రీశైలంలో 815.4 అడుగుల నీటిమట్టం..

దోమలపెంట(అచ్చంపేట): శ్రీశైలం జలాశయంలో బుధవారం 815.4 అడుగుల నీటిమట్టం, 37.6065 టీఎంసీల నీటి నిల్వ ఉంది. సాయంత్రం ఆరు గంటలకు జూరాల నుంచి 7,986 క్యూసెక్కుల నీరు శ్రీశైలానికి వస్తోంది. 24గంటల వ్యవధిలో 8,018 క్యూసెక్కుల నీటి ప్రవాహం శ్రీశైలం జలాశయానికి చేరింది. స్థానికంగా 10.40 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది.

తొమ్మిది యూనిట్లలో 320 మెగావాట్ల విద్యుదుత్పత్తి..

ఆత్మకూర్: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు దిగువ, ఎగువ జూరాల జల విద్యుదుత్పత్తి కేంద్రాల్లో విద్యుదుత్పత్తి విజయవంతంగా కొనసాగుతోంది. ఈ మేరకు బుధవారం రాత్రి తొమ్మిది యూనిట్ల ద్వారా విద్యుదుత్పత్తి చేపట్టినట్లు ఎస్ఈ రామసుబ్బారెడ్డి, డీఈ పవన్‌కుమార్ తెలిపారు. ఎగువలో ఐదు యూనిట్ల ద్వారా 175 మెగావాట్లు, దిగువలో నాలుగు యూనిట్ల ద్వారా 145 మెగావాట్లు విద్యుదుత్పత్తిని చేస్తున్నట్లు తెలిపారు. జూరాల ప్రాజెక్టుకు పూర్తి స్థాయిలో వరదనీరు చేరుతుండడంతో 38 వేల క్యూసెక్కుల నీటితో విద్యుదుత్పత్తి నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

నిండుకుండలా రామన్‌పాడు..

మదనాపురం : మదనాపురం మండలంలోని రామన్‌పాడు జలాశయంలో పూర్తిస్థాయిలో నీరు చేరడంతో బుధవారం నిండుకుండలా మారింది. నీటి మట్టం 1,021 అడుగులకు చేరింది. జూరాల ఎడమ కాలువ ద్వారా 640 క్యూసెక్కులు, సమాంతర కాలువ, ద్వారా 300 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. రామన్‌పాడు నుంచి ఎన్‌టీఆర్ కాలువకు 950 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. తాగు నీటి అవసరాల కోసం 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నట్లు ఏఈ సింగిరెడ్డి రనీల్‌రెడ్డి తెలిపారు.



దిగువ జూరాల పవర్‌హౌజ్ కేంద్రంలో విద్యుదుత్పత్తిని పరిశీలిస్తున్న అధికారులు

ఉల్లి ధర దిగొచ్చింది

దేవరకద్ర: కూరగాయల ధరలు వింటేనే ప్రజలు దడుసుకునే పరిస్థితి నెలకొంది. టమాటా కిలో రూ.150, పచ్చి మిర్చి రూ.160 పలుకుతోంది. అయితే, గుడ్డిలో మెల్లలా.. ఉల్లి ధర ఈ వారం కాస్త దిగిరావడం కొంత కలిసొచ్చింది. దేవరకద్ర మార్కెట్ యార్డులో బుధవారం జరిగిన వేలంలో ఉల్లి ధరలు దిగి వచ్చాయి. క్వింటాల్ ఉల్లి గరిష్ఠంగా రూ.1800, కనిష్ఠంగా రూ.1400 ధరలు పలికాయి. గత వారం గరిష్ఠం ధర రూ. 2140, కనిష్ఠ ధర రూ. 1800 వరకు వచ్చాయి. ఈ వారం గరిష్ఠంగా రూ. 340, కనిష్ఠంగా రూ. 400 వరకు ధరలు తగ్గాయి. ఇదిలాఉండగా, చిన్నపాటి ఉల్లి క్వింటాల్ రూ.800 వరకు ధర పలికింది.

బస్తా ధర రూ.900..

దేవరకద్ర మార్కెట్‌లో 45 కేజీల ఉల్లి బస్తా ధర గరిష్ఠంగా రూ. 900 నుంచి కనిష్ఠంగా రూ. 700, సన్నటి ఉల్లి బస్తా ధర రూ.400 వరకు విక్రయించారు. మార్కెట్‌కు దాదాపు రెండు వందల బస్తాల ఉల్లి అమ్మకానికి రావడంతో వ్యాపారులు పోటీ పడి కొనుగోలు చేశారు. తూకాల అనంతరం ఉల్లి బస్తాల వ్యాపారం జోరుగా సాగింది. మార్కెట్‌లో మధ్యాహ్నం వరకు ఉల్లి అమ్మకాలు పూర్తి అయ్యాయి. దేవరకద్ర సంతలో చిరు వ్యాపారులు కేజీ ఉల్లి రూ.20 నుంచి రూ. 25 వరకు విక్రయించారు.



దేవరకద్ర మార్కెట్‌లో ఉల్లి విక్రయాలు

ఒక్కసారి అవకాశమివ్వండి

- టీపీసీసీ కార్యదర్శి అనిరుధ్‌రెడ్డి

రాజాపూర్: ప్రజల సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకు ఒక్కసారి అవకాశం ఇవ్వాలని టీపీసీసీ కార్యదర్శి జనుంపల్లి అనిరుధ్‌రెడ్డి పేర్కొన్నారు. ఆయన చేపట్టిన ప్రజాహిత పాదయాత్ర బుధవారం ఈద్గాన్‌పల్లి శ్రీసీతారామాంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రారంభించారు. అనంతరం ఈద్గాన్‌పల్లి, యారోన్‌పల్లి, కల్లేపల్లి, పల్గుతండా, తిర్మలగిరితండాల మీదుగా యాత్రసాగింది. జడివానలో కూడా జనుంపల్లి యాత్రను కొనసాగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజాపూర్ నుంచి మల్లేపల్లి, ఈద్గాన్‌పల్లి వరకు ఉన్న బీటీరోడ్డు దెబ్బతిని గుంతలుగా మారినా ప్రభుత్వం, అధికారులు పట్టించుకోకపోవడం విడ్డూరమన్నారు. గ్రామాల్లో ఆటో డ్రైవర్లే గుంతల్లో మొర్రం పోసుకునే దుస్థితి ఏర్పడిందన్నారు. బీఆర్ఎస్ పాలనపై ప్రజలు విసిగిపోయారన్నారు. వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమని, ప్రజల కష్టాలు తొలగుతాయన్నారు.



కల్లేపల్లి శివారులో దప్పుకళాకారులతో పాటు దరువు వేస్తున్న జనుంపల్లి అనిరుధ్‌రెడ్డి